# గోల గోవిందుడిది. వేడుక వెంకన్నది!

నలుగురూ ఆ ప్రయత్నాలు చూసి ఎందుకు నవ్వుతారో నాకు తెలియదు గాని, మా లక్ష్మీకాంతం మామయ్య ఉన్నాడే, ఎవరికీ తోచని సరికొత్త సంపాదనా మార్గాలు కనిపెట్టడంలో అఖండుడు. లేకపోతే ఊకదంపుడు సొసైటీకి ఉచిత సలహాదారుగా యిన్నాళ్ళు ఎలా పని చేస్తాడూ?

ఆవాళ ఆ సంఘ సభ్యులంతా సాయంకాలం చల్లగాలి సమావేశంగా నల్ల చెరువు మెట్లదగ్గిర కలుసుకున్నారు. అందులో ప్రతీ వ్యక్తినీ చూస్తే ఈపాటికి మనిషి పాళంగా చాకలాడికి ఉతుక్కి వేస్తే బాగుండు ననిపిస్తుంది. ఒక చక్కని షేవింగు, ఒకజత మంచి బట్టలూ, ఒక పన్నెండణాల లైట్ టిఫినూ, ఒకే ఒక మూడు గుర్రాల మార్కు బీడీ - పాపం యిలాంటి చిన్న చిన్నవే వాళ్లు కోరేవి, వాళ్లకి లభ్యమవనివీ. దానిగురించే నిత్యం చర్చ, ఎప్పుడూ వేట. డబ్బు సంపాదనలో వివిధమార్గాల అన్వేషణకి వీళ్ళందరికీ మా లక్ష్మీకాంతం మామయ్య గౌరవనీయుంత. మన్ని సరస్వతి పరిసరాలకి రాకుండా చేసుకుంది, పోనీ దాని అత్తగారంటారే, ఆ లక్ష్మికైనా దయలేకపోయిందా?' అని వాళ్ళ నిరంతర సందేహం.

మా మామయ్య ఎత్తయిన రాయి మీద కూర్చున్నాడు. కొస్త కిందుగా నూర్నారాయణా, పెరుమాళ్ళూ, సుబ్బారాయుడూ కూర్చున్నారు. పెరుమాళ్లు అన్నాడు.

'అవ లింతదూరం వస్తాననుకోలేదు. నిన్న అడగాటిన అకరణం నహో పొమ్మన్నాడు. నాలుగు రూపాయలు లేకుండా యింటికెళ్ళి అక్కయ్యకి పిల్లలకి మొహం ఎలా చూపించను? తిరగలేక కాళ్ళు పడిపోయాయి'

'అక్కయ్య! అక్కయ్యకూ నీకూ ఏం సంబంధం? నీ యిష్టం వచ్చినచోటికి నువ్వు పోయి నీ పొట్ట పోషించుకుంటావ్. నాలా నీకు కుమ్మరిపురుగులాంటి పెళ్లాం లేదుగా?' సుబ్బారాయుడు తన దుఃఖం తను వెళ్ళబోశాడు. మామయ్య నవ్వేడు.

"అందుకేరా తమ్ముళ్ళారా! ఆలోచించకుండా అదికి ముందు పెళ్ళికి ఎగబడకూడదు. జరిగిందానికి విచారించనూ కూడదు. అన్నట్టు ఏడుకొండలు ఏడీ, పది రోజులై కనిపించనే లేదూ!"

ఇంకో అరూట పూర్తికాకుండానే ఏడుకొండలూ, ఆంజనేయులూ అక్కడికి రావడం అందరూ చూశారు. ఎప్పుడూ కనిపించని చిరునవ్వు, తమలపాకులు వేసుకున్న పెదిమలూ, పెదిమల మధ్య కొత్త ఖరీదయిన సిగరెట్టూ - మామయ్య మనస్సు ఎందుకో చివుక్కు మంది.

"ఏంరోయ్ ఏడుకొండలూ! బలే జల్సాగా ఉందే యవ్వారం - ఏమిటి కథ?" అందరూ వాడి చుట్టూ మూగేరు. ఆంజనేయులు చెప్పేడు.

"ఏదోరా, నాలుగురోజులు ఖుషీగా వెళ్ళడానికి వాడికి అదృష్టం కలిసివచ్చింది. నువ్వే చెప్పరా భాయ్" చేతులన్నీ ముందుకు చాచబడ్డాయి. చేతుల్లో సిగరెట్లు పడ్డాయి. అందరినోటికీ తలో దమ్మూ అందింది. ఏడుకొండలు మొదలుపెట్టేడు. అందరూ ఆత్రంగా వినసాగేరు.

## అవసరాల రామకృష్ణరావు

"ఈ మధ్య పత్రికలకి సేల్సు తగ్గిపోయాయి కదట్రా - అందుకని చందాదారుల్ని ఎక్కువ చెయ్యడానికి పత్రికలవాళ్లు చిన్న యిన్స్యూరెన్సు పోలసీ అవలంబించారట. ఇవన్నీ నాకు తెలీనే తెలీదు. మా యింట్లో అప్పూటకి తిండిలేకపోయినా "వసంత" రెగ్యులర్‌గా చదువుతారు. అదీ నా పేరునే, వస్తుంది. సరే ఆ సంగతి అలా ఉంచండి. ఈమధ్య పదిరోజులు నేను రాలేదు, ఎందుకనుకున్నారు?"

"ఎందుకూ?"

"ఎందుకేమిటి చచ్చినంత దెబ్బ తగిలితే! ఆమధ్య నేనూ మురళీ సైకిలుమీద వస్తున్నాం. ఓ ఎర్రగ్గిపుల్ల ఎదురైంది. ఆ డౌన్‌లో కాస్త స్పీడుగా తొక్కాం. దాంతో దాసన్న పేట తురకల చెరువుదగిర సైకిలు బోల్తాపడింది. వాడికి అట్టే దెబ్బ తగల్లేదు. లేచి, సైకిలు చూసుకుని 'అయ్యబాబోయ్ నా సైకిలు చెయిను జారిపోయిందే' అన్నాడు. 'ఉండవయ్యా సైకిలు చెయినేమిటి, నా వెన్నుపూసే జారిపోయింది!' అన్నాను నేను. అంత గట్టిదెబ్బ తగిలింది. వారం రోజులు తిరక్కుండా 'వసంత' పత్రికవాళ్లు ఏభైరూపాయలు పంపించారు!"

"అదేమిటి? ఎందుకూ?"

"చెప్పేనుగా! చందాదారుల్లో ఎవరికి ప్రమాదం జరిగినా, ప్రమాదాన్ని అనుసరించి పత్రికలవాళ్లు డబ్బిచ్చుకుంటారనీ!"

అందర్నీ తోసుకుని మామయ్య ముందుకొచ్చేడు.

"అన్ని పత్రికలవాళ్లూనా?"

"ఆహాఁ" మామయ్యకి ఏం ఉపాయం తోచిందో పిడతలాంటి ఆ చిన్న బుర్రలో ఏం మెరుపు మెరిసిందో తెలీదు. లేచి సంతోషంతో గంతులు వెయ్యడం ప్రారంభించాడు. అందరూ ఆశ్చర్యంతో చూశారు.

"ఒరే సుబ్బారాయుడూ నీకేం కావాలిరా?"

"ఎందుకూ?"

"అదికాదు. ముందు చెప్పవోయ్ కరువ వడీ, సొమ్మొస్తే నువ్వు ముందేం కోరుకుంటావ్?'

"మలబార్ హోటల్లో కొత్తగా చేరిన సర్వర్‌కి కాళ్లు విరిగేలా ఆర్డరు ఇయ్యాలి!"

"ఓస్ యింతేనా, నువ్వురా పెరుమాళ్లూ?"

"ఒక మలయా షర్ట్, ఒక లినెన్ పేంటూ యివి రెండూ చాలు. ఇవే ఉంటే ఆనాడు గంగాభాయి నన్నంత నీచంగా చూసునా?"

"నీకోయ్ నూర్నారాయణా?"

"ఎందుకు మేష్టారూ అక్కర్లేని జరగని ఆశలూ? వంటకే ఓ సావలా చాలు; పేక గడ్డానికి పేక అరకప్పు కాఫీకీని."

లక్ష్మీకాంతం మామయ్య నవ్వుతూ చప్పట్లు కొట్టేడు.

"సెభాష్. చిన్నవైనా, పెద్దవైనా మీ కోరికలు తప్పకుండా ఫలిస్తాయి. ఎండిపోయిన మన చెరువులు నిండుతాయి. ఇక కప్పల రొదతో మనకి ఊపిరి సలపదు"

మామయ్య సరదా చూస్తే అందరికీ ఆశ కలిగింది.

"ఎందుకు యింకా మమ్మల్ని దంచుతారు? డబ్బు సంపాదించే ఆ కిటుకు ఏమిటో కాస్త త్వరగా చెవిని వెయ్యండి మేష్టారూ."

"ఇంకా మీకు తోచలేదా? ఇప్పుడు యీ ఏడుకొండలు చెప్పినదాన్నిబట్టి నాకు

# ★ గోల గోవిందుడిది వేడుక వెంకన్నది! ★

ఏం తోచకుంటుందో యింకా మీకు అవగాహన అవలేదా? ఓరి వెర్రి దద్దమ్మల్లారా! అందుకే దరిచివ పీడకల్లా ఎప్పటికీ వేసినచోటునే ఉన్నారు. కొంచెం మదుపూ, కాస్త అదుపూ ఉంటే ఎంత సొమ్మైనా సంపాదించవచ్చు. ఏడుకొండలు చెప్పింది విన్నారుగా. ప్రమాదాలకి గురిఅయిన దంపుదాన్లకి పత్రికలు సొమ్మిస్తాయనీ! మనలో ఎవరో ఒకర్ని అన్ని పత్రికలకీ చందా కట్టిద్దాం!

"సొమ్మో?"

"మొట్టమొదట ఆమాత్రం చిన్న పెట్టుబడి అయినా పెట్టగలగాలి మరి. దానికీ చందాలు వేసుకుందాం. ఆ వ్యక్తి ప్రమాదానికి గురైతే కావలసినంత సొమ్ము! అందరం హాయిగా పంచుకుందాం!"

"ప్రమాదంలో తల దూర్చడానికి ఎవరు ఒప్పుకుంటారూ?"

"ఇదుగో - యింతకన్న దరిద్రపు ప్రశ్న మరొకటి లేదు. అందుకే మీతో నే నేది చెప్పను. తిండిలేక శరీరానికి బుర్రకీ ఏవిధమయిన కాంతీ లేక మనందరం యించుమించు ఆత్మహత్యకి సిద్ధంగా ఉన్నాం. బోలెడు డబ్బు వస్తుందంటే చిన్న ప్రమాదానికి ఒప్పుకోలేమూ? నాగరికత బలిసిన యీ యిరవైయో శతాబ్దంలో, యింత పట్నంలో ప్రమాదాల కేం లోటూ?"

మామయ్య చెప్పింది అంతో యింతో అందరికీ నచ్చింది. కాని చూసి చూసి అపాయంలో ఎవడు యిరుక్కుంటాడూ? చిన్న కాగితంమీద ఒక శ్రీ, అయిదు సున్నాలూ వేశారు. శ్రీ ఎవరికొస్తే వాడు కాలో చెయ్యో విరుచుకోవాలి. లాటరీ వేశారు. శ్రీ, ఆంజనేయులికి వచ్చింది. వాడు దస్తే ఉండనని పేచీ. ఆఖరికి వచ్చిన డబ్బులో నాలుగో వంతు వాడు తీసుకోడానికీ మిగిలింది అందరూ పంచుకోడానికీ మామయ్య అతికష్టపడి ఒప్పించాడు.

మూడు వారాలు కాబోలు అతికష్టపడి సొమ్ము సంపాదించి ఆంజనేయులు పేర కాస్త పేరుప్రఖ్యాతులున్న పది పత్రికలకి చందా కట్టించారు. సుబ్బారాయుడు యింట్లోంచి రెండు వెండిగిన్నెలు ఎత్తుకొచ్చి అమ్మేశాడు. మా మామయ్య తన పాత సైకిలు ఒకరిక్రింద తణఖా పెట్టేడు. ఏడుకొండలు సినిమా హాల్సువద్దర కాసి ముందుగా టిక్కెట్లు కొని లాభాలకి అమ్మి కొంత సొమ్ము సంపాదించేడు. మొత్తం మీద భవిష్యత్తుపై బ్రహ్మాండమైన ఆశ పెట్టుకుని నాళు కలిసికట్టుగా పట్టు పట్లు [illegible] అంటూ ఉన, వాళ్ళకి ఎవరికైనా జాలీ వెయ్యకమానదు. యథాప్రకారం ఆనాడు సాయంకాలం ఊకదంపుడు సొసైటీ అత్యవసర కార్యక్రమంలో పాల్గొంది.

"ఇంకా ఎన్నాళ్లు చేస్తావురా ఆంజనేయులూ? త్వరగా కానియ్యి"

"ఎలాగ మేష్టారూ, అనుకున్నంత సులభమా?"

"ఎప్పుడో ఒకప్పుడు తప్పదుగదా - అయినా ఎంతసేపూ? సరిగ్గా సాయంకాలం నుంచి రష్‌గా ఉన్నప్పుడు కరాచీ స్టోర్సు ఎదురుగుండా మెయిన్‌రోడ్డుమీద అయిదు నిముషాలు కళ్లు మూసుకు నిలబడు. ఏ కారో, స్వరబ్బండీయో జాయ్‌గా మీద నుంచి ఎక్కుస్తుంది. మన సొమ్ము దక్కుతుంది. అంతేగా?" ఆంజనేయులు శరీరం వైపు ప్రేమతో చూసుకుంటూ అన్నాడు.

"ముల్లు గుచ్చుకుంటే ఓర్వదే యీ సుకుమార శరీరం? చూస్తూ చూస్తూ ఎలాగండీ?"

"అయిదు నిముషాలపాటు యీ శరీరం నీది కాదనుకో—మరు క్షణంలో లక్ష్మి నీ ముందు వాలుతుంది. మనం తిండికి లేక ఎంత బాధపడుతున్నామో ఆలోచించుకో. నీ చేతిలో డబ్బు పడ్డాక నీ గౌరవం, నీ హోదా ఊహించుకో. అన్నట్టు నువ్వు యిష్టపడుతున్న మా ఎదురింటి అమ్మాయి పేరేమిటే?"

"ఎవరూ? ఆ జిలుగు వెలుగుల తేనె చినుకా? పేరు వెంకటమ్మ"

"ఇంకేం? ఆ వయ్యారి కాల్‌గేట్ బేబీ పౌడరు కొనుక్కుందామని, చేత హేండు బ్యాగ్ ధరించి మోడరన్ స్టోర్సులోకి వెళదామనుకుంటోంది. అన్నట్టు ఆ అమ్మాయికి చిన్న తమ్ముడు ఉన్నాడుకదూ, నీ కాబోయే బావమరిది గాడు! వాడు ఎలాగా అక్క కొంగు వదలనే వదలడు. అక్కతో బజారుకి వచ్చాడు. తిన్నగా ఉండక ఓ సినిమా బండీ వెనకాతలపడ్డాడు. పక్క సందునుంచి అతి స్పీడుతో కారు వస్తోంది. వెంకటమ్మ వెనక్కి తిరిగి హడలిపోయింది. కారు ముందు తమ్ముడు. "హా సోదరా, ఏకోదరా, లంబోదరా! నిన్ను రక్షించు వాడు లేడా? ఓ దిక్పాలకులార! ఓ జన సమూహములార! చూచుచు ఊరకుందు రేల?" అని విలపించింది. నువ్వు గంట స్తంభం ఎదురుగుండా అరకట్ట జాడీబీడీలు అరువు తీసుకుంటున్నావ్. అప్పుడు ఈ కేక - ఈ కుసుమకోమల వనిత దీనాలాపన వినిపించింది, ఏం చేస్తావ్?"

"ప్రాణం పోతేపోయింది, వెళ్లి అపూర్వ సాహసం ప్రదర్శించి, ఆ బావమరిదిగాడ్ని చెవిపట్టుకుని యివతలికి యీడ్చుకురానూ?"

"భేష్! లక్షలు విలువచేసే మాట అన్నావ్. ఇంకేం! అలాంటి దక్కని ఊహా చిత్రించుకో. దబ్బగా మీదనుంచి ఏ కారో వాలుమొగ్గ వేస్తుంది. పెద్దాసుపత్రిలో జాయిన్ చేయించి అయిదు నిముషాల్లో బాగుచేయించుకుంటాం. ఆ తర్వాత చూడు కనీసం అయిదు వందలు! పత్రికలు దివాళా తియ్యాలి!"

ఆంజనేయులు ఏమంటాడో అని అందరూ అతి ఆతృతతో వాడి ముఖం వైపు చూశారు. వాడు మాట్లాడలేదు. మామయ్య అంతటితో వదిలిపెట్టలేదు.

"ఈ రాత్రి జాగ్రత్తగా ఆలోచించు. కొద్ది ఓర్పు, కాస్త నిశ్చయం చాలు. నీమీద మేమందరం ఆధారపడి ఉన్నాం. ఆశలు పెట్టుకున్నాం. పుస్తె, పూసా అమ్మి చందాలు కట్టేం - నిన్ను ప్రార్థిస్తున్నాం"

అందరూ దీనంగా వాడివైపు చూశారు.

"ఇన్ని కబుర్లు చెబుతున్నారు గాని సాగదీసి లెంపకాయకొడతానంటే మీలో ఎంతమంది ఎదురుగుండా వస్తారు? అందరి శరీరాలూ అంతే. ఆలోచిస్తాను, నామీద మాత్రం ఎక్కువ ఆశలు పెట్టుకోకండి"

ఆంజనేయులు చరచరా వెళ్ళిపోయాడు. అయిదు నిమిషాలు ఎవరినోటా మాటలేదు. తరువాత ఏడుకొండలు అందుకున్నాడు.

"చూస్తే యీ వెధవ మనకి పంగనామం పెట్టేలా ఉన్నాడు."

"ఈ సంగతి మనం అనుకోకముందు, అంటే యీ చందాలు మనం కట్టకముందు ఆంజనేయులకి జరిగిన ప్రమాదాలు యిన్నీ అన్నీ కావు. వెధవ, మూడుసార్లు అయ్యకోనేట్లో మునిగి బ్రతికేడు. మొన్న మొన్న మునగచెట్టుమీంచి పడి వర్షి పచ్చడైంది. మనం యీ విషయం మొదలుపెట్టిం దగ్గర్నుంచీ జిట్టి చిరి ఎరగడు. వారం, వారం వచ్చే పత్రికలు హాయిగా చదువుకుంటున్నాడు."

"వీడు మన ఆశలు ఎలాగా వట్టెట్లో కలిపేడు. నావల్లగాదని యించుమించు స్పష్టంగా చెప్పేడు. ఆఖరికి కుక్కతోకతో గోదావరి యీతలాగుంది!"

మామయ్యకి అపజయం లేదు. ఏ ఆశతోనో ఆ చిన్నకళ్ళు మిలమిల మెరిశాయి!

"కుక్కంటే జ్ఞాపకం వచ్చిందీ, కుక్క కరుస్తే దానికేమైనా ఉందా ఏడుకొండలూ!"

"ఎందుకులేదూ? ప్రమాదం హెచ్చుతగ్గుల్ని అనుసరించి ప్రతిఫలం ఉండనే ఉంది. కుక్క కరుస్తే యింతనీ, కముకు

దెబ్బ తగిలితే యింతనీ, పన్ను విరుగుతే యింతనీ సొరికట్టి ఏర్పాటా, మరోకటా?"

ఇంకేం మా లక్ష్మీకాంతం మావయ్య చెయ్యవలసిన అన్ని ప్రయత్నాలూ చేయించాడు. తాసిల్దారుగారి కుక్కని ఎప్పుడూ విప్పే ఉంచుతారు. అది కొత్తవాళ్ల రక్తం చవిచూడకుండా వదలదు. ఆంజనేయుల్ని ఒకనాడు అక్కడికి ఒక మిషతో రప్పించడానికి ఏర్పాటయింది. అనుకున్న ప్రయత్నం ఎంతవరకూ జరిగిందో చూడ్డానికి ఆ వేళకి మా మావయ్య అక్కడికి వెళ్లేడు. ఇంకేముంది? సింహంలాంటి కుక్క మావయ్యని వెంటబడి అరంగుళం ముక్క ఎడంకాలి గుత్తిదగిర ఊడదీసింది. మర్నాడు ఆస్పత్రిదగ్గిర అందరూ కలుసుకున్నారు.

"ఎంత పనిజరిగింది మేష్టారూ? ఆ దగుల్బాజీకి కుక్క యిలాంటిదని ముందే తెలుసుట. అరుపు వినగానే ఎదురుగుండా చింతచెట్టు ఎక్కేశాడు. ఇంతకీ ప్రాప్తం!"

అయిదురోజుల అనంతరం లక్ష్మీకాంతం మావయ్య ఆసుపత్రినుంచి కుంటుకుంటూ యివతల పడ్డాడు. ఆసుపత్రి గేటుదగ్గిరే పరుగు పరుగున ఊకదంపుడు సొసైటీ మెంబర్లందరూ, అతి సంతోషంతో పరిగెత్తుకువచ్చారు. పెరుమాళ్ళు మొహం పెట్రమాక్సు లైటంత చేసుకుని అన్నాడు.

"విన్నారా మేష్టరూ? శరీరాన్ని ఎంత కాపాడుకున్నా అదృష్ట లక్ష్మిని ఎవరు అడ్డగలరూ? ఇవాళ మనం లేచిన వేళ ఎంత మంచిదో! ఆంజనేయులు లారీక్రింద పడ్డాడు! పెద్దాసుపత్రిలో ఉన్నాడు!"

వాడు కావాలని పడ్డాడా ప్రమాదవశాత్తూ పడ్డాడా అని ఎవరూ అడగలేదు. ప్రమాదవశాత్తూ అని అందరికీ తెలుసు. లారీక్రిందపడి బ్రతికే ఉన్నాడా అని మా మావయ్య అడగలేదు. వాడిప్పట్లో చావడని మావయ్యకీ తెలుసు.

"ఎంత చల్లని, తియ్యని కబురు విన్నానురా! మనదగ్గిర సొమ్ములేదుగాని యింత సంతోష సమయంలో ముందు టీపార్టీ చేసుకుని తరువాత సినిమా పార్టీ జరగవలసిన మాట! సరేలెండి, మన అదృష్టవశాత్తూ కాస్త గట్టిదెబ్బే తగిలిందా?"

"గట్టిదెబ్బేమిటి, మీ చెయ్యి ఎగిరిపోతే! పెద్దాసుపత్రిలో జాయిన్ చేశారు. ప్రస్తుతం ఒంటిమీద తెలివిలేదు, మూలుగుతూ పడుకున్నాడు"

ఆ మరసటి ఆంజనేయులు రెండు వారాలుపైగా ఆసుపత్రిలో ఉన్నాడు. మిత్రబృందం రెండు మూడుసార్లు వెళ్ళినా వాడ్ని కలుసుకోడానికి కుదరలేదు. ఆఖరికి రేపు డిస్చార్జి చేస్తారనగా మావయ్యా, శిష్యులూ వాడ్ని ఆసుపత్రిలో కలుసుకున్నారు. అతనికి దూరపు చుట్టమట, ఓ తలచెడిన ముసలావిడ దగ్గిరుండి సేవ చేస్తోంది. మావయ్య మొదలుపెట్టేడు.

"ఏం ఆంజనేయులూ, చాలా పెద్దదెబ్బ తగిలిందిటా? నిజంగా నీగురించి విచారించని రోజు లేదు."

ఆంజనేయులు కళ్లు విప్పేడు. ఏమిటో ఆశ్చర్యంగా కళ్లు పెట్టేడు.

"మీరు ఎవరూ అని అడుగుతున్నాడు" అంది కూడా ఉన్న అవ్వ. ఆమాట వినేసరికి ఎవరికీ ప్రాణాలు లేవు.

"అదేమిటి ఆంజనేయులూ? నేనూ, లక్ష్మీకాంతాన్ని. ఇదుగో వీడు ఏడుకొండలు. మనందరం స్నేహితులం కామూ? నువ్వు మమ్మల్ని మరిచిపోడమేమిటీ ఆశ్చర్యం! ఎలాఉందీ వంట్లో? మేం జ్ఞాపకానికి వచ్చామూ?"

"లే - దు" అన్నట్టు సంజ్ఞ చేశాడు వాడు.

"అదేంవిటి అవ్వగారూ! మేము ప్రాణస్నేహితులం"

"ఏమో బాబూ, స్వయంగా తోచిందో, ఏ నెలతక్కువ వెధవలయినా చెప్పిపెట్టేరో యిట్టే కారుక్రింద పడ్డాడు. అతి కష్టం మీద శరీరం దక్కిందిగాని ఆ దెబ్బకి తట్టుకోలేక బుర్ర చెడింది. బొత్తిగా లేని వాళ్ళం. ఈ స్థితిలో ఏ పత్రిక వాళ్ళకి దయగలిగిందో ఎనిమిదివందలు పంపించారు. విశాఖపట్నం వెళ్ళి బాగు చేయించుకోవాలి"

ఇంత హీనస్థితిలో మావయ్య ఊరుకోలేకపోయాడు. జరిగిందంతా 'గజేంద్ర మొర'లా అవ్వకి చెప్పుకున్నాడు. కూడా వచ్చిన శిష్యులు తాళం వేశారు.

"వాడు చెప్పిందే నా చేతిలో ఏముంది నాయనా, నేనేం చెయ్యగలనూ? అయినా యిలాంటి వాటిలో రాతకోత లుంటాయంటారు, చూపించండి. నేనుగాని మా అంజిగాడుగాని ఎవళ్ళకీ యింత పిసరు అన్యాయం చెయ్యడం ఎరగం" మావయ్యకి కళ్ళవెంట నీళ్ళు వచ్చాయి. ఆఖరుసారి గద్గదకంఠంతో అన్నాడు.

"మాపిమ్మా ఆంజనేయులూ, ఒక్కసారి నన్ను చూసి గుర్తించు. నేనూ లక్ష్మీకాంతాన్ని - మనం నల్లచెరువు మెట్లదగ్గిర కలుసుకునేవాళ్లం కదూ?"

ఆంజనేయులు మొహం చిట్లించాడు. కోపంగా చూశాడు.

"వాడికి కోపం తెప్పించకూడదని డాక్టరుగారు అన్నారు. మీరెవరో వాడు ఎంతమాత్రం గుర్తించలేదు. మళ్ళీ కలుసుకోవచ్చు వెళ్లండి."

ఇంకా వాళ్ళని వర్ణించడమెందుకు? అందరూ వెళ్ళిపోయారు. ఈ కథ యిక్కడితో ఆగిపోతే అందమే లేదు. తరువాత జరిగింది వినండి. వాళ్లిలా వెళ్ళనిచ్చి ఆంజనేయులు లేచి కూర్చున్నాడు.

"ఎంత చక్కగా చెప్పావే మామ్మా!" అన్నాడు సంతోషంగా.

"లేకపోతే? ఇంత దెబ్బ నీకు తగులేతే ఆ వెధవలు పంచుకుతింటారా? అసలు మా నాయన బతుకుతాడనుకున్నానా?" కనుకొలుకులు వత్తుకుంది.

"నువ్వన్నట్టు విశాఖపట్నం పోదాం మామ్మా, కళ్ళకోట్టు పెట్టుకుంటాను", ఓరి ఆంజనేయులు, ఎంత దురాలోచనరా నీది! అయ్యో లక్ష్మీకాంతం మావయ్య, నీ తెలివంతా ఏమైపోయిందయ్యా!

(వోడ్ హౌస్ ఆధారంగా)

★

కుష్ఠు ★ బొల్లి
వగైరా మేహమచ్చలు, సెగ, సవాయి వ్యాధులకు గ్యారంటీ చికిత్స. క్యాటలాగు ఉచితము:
సలహాకు జి. వి. రెడ్డి & కో. (రిజిష్టర్డు)
"భాస్కరాశ్రమము."
గోపాలపురం. తూర్పుగోదావరి.

Andhra University B. A. (Mathematics)
QUESTIONS AND ANSWERS
**ANALYTICAL GEOMETRY and CALCULUS.**
(For Students of South Indian Universities)
*By*
**P. LAKSHMANARAO, M. A.,**
**Price Rs. 4/-.**
*Copies can be had from :—*
The Author, Railpet, GUNTUR.